కేటీఆర్‌ను దూషిస్తే సహించం

- రేవంత్ మెప్పు కోసమే చామల చిల్లర మాటలు
- కేటీఆర్‌ను తప్పుడు కేసులో ఇరికించే కుట్రలు
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి మండిపాటు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేస్ చెత్త కేసును అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ నేతలు కేటీఆర్‌ను ఇష్టమొచ్చినట్టు దూషిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ మెప్పు కోసమే భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పేమెంట్ కోటాలో ఎంపీ అయిన ఆయనకు పదేండ్లు మంత్రిగా పనిచేసిన ఉద్యమ నేత కేటీఆర్‌ను విమర్శించే అర్హతలేదని ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ భవన్‌లో రావుల విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యలపై అడుగడుగునా ప్రశ్నిస్తున్న కేటీఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు కేసు పెట్టి పైశాచికానందం పొందుతున్నదని విరుచుకుపడ్డారు. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నాడని రేవంత్‌పై ఆరోపణలు గుప్పించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇప్పుడు సీఎం మోచేతి నీళ్లు తాగేందుకు బీఆర్ఎస్ నేతలపై పిచ్చికూతలు కూయడం విడ్డూరమని నిప్పులుచెరిగారు. రేవంత్ సర్కారు ఏడాది పాలనలో తెచ్చిన రూ.1.40 లక్షల కోట్ల అప్పుల్లో వాటాలు పంచుకొనేందుకే మంత్రులు కేసీఆర్, కేటీఆర్‌పై దూషణలకు దిగుతున్నారని విమర్శించారు. సర్కారు ఒత్తిడితోనే కేటీఆర్‌పై ఏసీబీ కేసు పెట్టిందని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు న్యాయవ్యవస్థపై సంపూర్ణ నమ్మకమున్నదని, కేటీఆర్ క్లీన్‌చిట్‌తో బయటపడుతారని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడబోమని రోజూ ప్రజాసమస్యలు, హామీలపై నిలదీస్తూనే ఉంటామని స్పష్టంచేశారు.

దిల్‌రాజు కల్లు.. మటన్ షాపులే పెట్టాలి!

- సినిమాలు ఎందుకు విడుదల చేయాలి?
- గేమ్ చేంజర్‌కు మినహాయింపులు ఎందుకు?
- నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- తెలంగాణ ప్రజలను దిల్‌రాజు అవమానించారు: రసమయి ఫైర్



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, నాయకులు దేవీప్రసాద్, రాంచందర్‌నాయక్, వాసుదేవరెడ్డి తదితరులు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణి మరోసారి బయటపడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. దిల్ రాజు తెలంగాణ వ్యతిరేకి అని, ఆయన నిర్మించిన సినిమాకు ప్రభుత్వం ప్రత్యేక మినహాయింపులు ఎందుకు ఇచ్చిందని ప్రశ్నించారు. "తెలంగాణలో కల్లు, మటన్‌కే వైబ్ ఉంటుందన్న దిల్‌రాజు ఇక్కడ సినిమాలు ఎందుకు విడుదల చేయాలి? కల్లు, మటన్ షాపులు పెట్టుకోవాలి" అని మండిపడ్డారు. సినిమా టికెట్ల రేట్లు పెంచి పేద ప్రజల జేబులు లూటీ చేయబోమని చెప్పిన రేవంత్‌రెడ్డి గేమ్ చేంజర్ సినిమాకు మినహాయింపులు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, మెతుకు ఆనంద్, పార్టీ నాయకులు గజ్జెల నగేశ్, వాసుదేవరెడ్డి, రాకేశ్, రఘురామ్, మహేందర్‌తో కలిసి దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. బెనిఫిట్ షోలపై పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పుడేం సమాధానం చెప్తారని నిలదీశారు. తెలంగాణ సంస్కృతిపై రేవంత్ ప్రభుత్వం చేస్తున్న దాడిని ఖండిస్తున్నామని చెప్పారు.

రేవంత్ ఎంతకు అమ్ముడుపోయారు?: రసమయి

తాను సీఎం కుర్చీలో ఉన్నంత వరకు సినిమాల టికెట్ రేట్ల పెంపు ఉండబోదన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎంతకు అమ్ముడుపోయి ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు నిర్మించిన గేమ్ చేంజర్ సినిమాకు ప్రత్యేక మినహాయింపులు ఇచ్చారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై మాట తప్పినట్టే సినిమా టికెట్ల రేట్ల పెంపుపైనా సీఎం మాట తప్పారని విమర్శించారు. సినిమా వాళ్లు ఏమైనా దేశభక్తులా? ఆర్మీలో చేరి దేశానికి సేవ చేశారా? అని అసెంబ్లీలో ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి దిల్‌రాజు సినిమాకు మినహాయింపులు ఇవ్వడం వెనుక లాభాపేక్షమైన ఒప్పందం జరిగిందని ఆరోపించారు. అన్నింటిపై యూటర్న్ తీసుకుంటున్న రేవంత్‌కు ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

బీర్ల కాదు..భూ దందాల ఐలయ్య

- కొలనుపాకలో ఏడున్నర ఎకరాలు కొల్లగొట్టిండు
- అక్రమార్కుడికి కేటీఆర్‌ను విమర్శించే హక్కు లేదు
- ఐలయ్య అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఫైర్

హైదరాబాద్, జనవరి 9 (నమస్తేతెలంగాణ): 'రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా అనేక మంది భూములను చెరబట్టిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కేటీఆర్‌పై అవాకులు చెవాకులు పేలడం విడ్డూరం' అని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఫైర్ అయ్యారు. 'ఆయన పేరు బీర్ల ఐలయ్య కాదు..భూదందాల ఐలయ్య' అంటూ ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తి హైదరాబాద్‌కు ఫార్ములా ఈ-రేస్ తెచ్చి రాష్ట్ర ఖ్యాతిని పెంచిన కేటీఆర్‌పై విమర్శలు చేయడం విడ్డూరమని విరుచుకుపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఐలయ్య రాత్రికిరాత్రే పేదల భూములను పెద్దల పేరిట రిజిస్ట్రేషన్లు చేయించారని విమర్శించారు. కొలనుపాకలో 7.22 ఎకరాల భూమిని 154 మంది పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారని చెప్పారు. ఆయన చేసిన భూ దందాలు, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, ఈడీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తనను ప్రశ్నిస్తున్నారే నెపంతో ఎలాంటి ఆధారాలు లేకున్నా కేటీఆర్, పట్నం నరేందర్‌రెడ్డి, లగచర్ల రైతులపై కేసులు పెట్టిన రేవంత్‌రెడ్డి..అన్ని ఆధారాలున్నా సొంత పార్టీ ఎమ్మెల్యే దురాగతాలు, భూ దందాలపై ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని నిలదీశారు.

బోధన్ సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, బీఆర్ఎస్ నేతలు

కాంగ్రెస్ మోసాలపై భగ్గుమన్న బీఆర్ఎస్

బోధన్/బాన్సువాడ, జనవరి 9: ఆరు గ్యారంటీల పేరిట రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణులు గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. బోధన్‌లో సబ్ కలెక్టరేట్‌ను ముట్టడించగా, బాన్సువాడలో ధర్నా నిర్వహించారు. రైతు భరోసాలో కోత విధించడంతో పాటు రైతులు ప్రమాణ పత్రం ఇవ్వాలంటూ షరతు విధించటంపై మండిపడుతూ బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి, బీఆర్ఎస్ నాయకురాలు ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ.. రైతుబంధు కావాలంటే రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలంటూ షరతు విధించటం విమర్శించారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బాన్సువాడలో ఎడ్లబండితో నిరసన తెలిపారు.

ప్రశ్నిస్తున్నందుకే కేటీఆర్‌పై కేసు

- ఎన్ని కేసులు పెట్టినా భయపడం
- ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటం
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 9: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టారని మాజీ మంత్రి పీ సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం మండలంలోని పడమటి తండా నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫార్ములా-ఈ రేసుపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేసినా సీఎం రేవంత్‌రెడ్డి సమయం ఇవ్వలేదని తెలిపారు. బీఆర్ఎస్ నేతలపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామని ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ నోరెత్తితే అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సర్పంచుల బిల్లులు మంజూరు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల కోసం కొత్త రేషన్‌కార్డులను తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. పాలనను గాలికొదిలేసి కక్షపూరితంగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాకోర్టులో ఆయనకు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, పోచారం సుధాకర్‌రెడ్డి, అంభయ్య యాదవ్, అనుమగల్ల చంద్రయ్య, కర్రోల చంద్రయ్య, నవీన్, అనిత రవి నాయక్, కాటమన్ ప్రభాకర్, లింగం, రాజు నాయక్, రాజేష్, పాండు, దేవుల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

- అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యం ఖూనీ
- రేవంత్‌పై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం

సిరిసిల్ల టౌన్/హుజూరాబాద్ టౌన్, జనవరి 9: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరైన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను గురువారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులు, నిర్బంధాలు బీఆర్ఎస్‌కు కొత్తేమీ కాదని చెప్పారు. హుజూరాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సంకెళ్లు వేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతున్నదని ఆరోపించారు. అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని రేవంత్ సర్కారు ఖూనీ చేస్తున్నదని విమర్శించారు. జమ్మికుంటలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వీణవంకలో మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపెల్లి మహేశ్, నియోజకవర్గ యువ నేత నాగిరెడ్డి మధుసూదన్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, నాయకులు అన్నారం శ్రీనివాస్, గుండ్లపల్లి పూర్ణచందర్, దార్ల సందీప్, సబ్బని హరీశ్, కంచర్ల రవిగౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కుమ్మెనపెంటలో దుప్పట్లు, బియ్యం పంచుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, జర్నలిస్టు సంఘం నాయకులు

చెంచులను తరమొద్దు

- పులులు, చెంచులను వేర్వేరుగా చూడొద్దు
- యుగాలుగా వారు విషాదాన్ని గుండెల్లో మోస్తున్నారు
- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): అడవి, చెంచులు వేర్వేరు కాదని, నల్లమల అడవి వారి ఆవాసమని, తల్లి తావు నుంచి గిరిజనులను వేరు చేయవద్దని ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పాలకులను కోరారు. వేల ఏండ్లుగా అడవిలోనే నివసిస్తున్న చెంచులు వాటిని కాపాడుకున్నారే తప్ప, ఏనాడూ దాన్ని నాశనం చేయలేదని స్పష్టం చేశారు. చెంచులకు, జంతులకు మధ్య మానవాతీత అనుబంధం ఉందని, అది ఈనాటిది కాదని ఆయన ఉద్ఘాటించారు. నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం కుమ్మెనపెంటలో గురువారం ఆయన చెంచులతో మమేకమయ్యారు. 12వ శతాబ్దంలో జరిగిన పలనాటి యుద్ధం నేపథ్యంలో చెంచు గిరిజన మానవ జీవిత పార్శ్వాన్ని తడుముతూ సీనియర్ పాత్రికేయులు వర్ధెల్లి వెంకటేశ్వర్లు 'కారుకోడి' నవల రాస్తున్నారు. ఈ నవలకు కావాల్సిన కథా వస్తువులు సేకరించడానికి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, 'నమస్తే తెలంగాణ' అసోసియేట్ ఎడిటర్ రఘురాములు, జర్నలిస్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్ గైడ్‌గా వెళ్లారు. మూడు రోజుల పాటు కుమ్మెనపెంట, చిగుర్లపాడు, కొల్లం పెంట గ్రామాల్లో తిరిగి చెంచుల భాషా, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం తదితర అంశాలపై సమాచారం సేకరించారు. రాళ్లరేవు, బంగారి మడుగు తదితర ప్రాంతాల్లో సంచరించి నాటి సాంస్కృతిక, సాహిత్యపు ఆనవాళ్లను సేకరించారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ.. హింస, స్వార్థం, క్రౌర్యం, అనుమానంతో ప్రపంచమంతా బతుకుతున్న ఈ కాలంలో.. పరిమితంగా ప్రశాంత జీవనం గడుపుతున్న చెంచులు మనకు అనేక పాఠాలు నేర్పుతున్నారని పేర్కొన్నారు. శతాబ్దాలుగా చెంచులు తమ గుండెల్లో విషాదాన్ని మోస్తున్నారని, వారి నుంచి ఆరు పాటలు సేకరించగా.. అన్నింటిలోనూ విషాదమే నిండి ఉన్నదని తెలిపారు. కుమ్మెనపెంటలో చిన్నారుల కోసం ఒక అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అందు కోసం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణను తాను స్వయంగా కలిసి విజ్ఞప్తి చేస్తానని వెల్లడించారు. అలాగే వారి ఇంటి స్థలం కోసం ఎకరం భూమిని కూడా అడగాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. అనంతరం చెంచు కుటుంబాలకు దుప్పట్లు, బియ్యం, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జాతీయ నాయకులు అవ్వారి భాస్కర్, రాష్ట్ర నాయకులు చందు నాయక్, మాజీ జడ్పీటీసీ ఇంద్రయ్య సాగర్, రంజిత్, రమేష్, మహేశ్ ఆంజనేయులు సాగర్, మధు సాగర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు కోర్టు స్టే అర్డర్ కాపీని అందజేస్తున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములియ్యం

మొదటిపేజీ తరువాయి...

అమన్‌గల్‌లో రైతులు తిరగబడ్డారు. తాజా గా యాచారం మండలంలోని కుర్మిద్ద గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేపై తిరగబడ్డారు. సర్వే మార్కింగ్‌కు వెళ్లిన అధికారులను నిలదీశారు. గ్రామపంచాయతికి అనుబంధంగా ఉన్న మంగలిగడ్డతండాలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, యాచారం తహసీల్దార్ అయ్యప్ప, రెవెన్యూ సిబ్బంది గురువారం సర్వే కోసం అక్కడికి వెళ్లారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు, యాచారం సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలను మోహరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

కోర్టులో తేలే వరకు రావొద్దు

మంగలిగడ్డతండాలో 82, 94 సర్వే నంబర్లలోని భూమిలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే మార్కింగ్‌కు రెవెన్యూ అధికారులు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. కోర్టు స్టే ఉన్న భూములను ఎలా సేకరిస్తారని, కనీసం సమాచారం లేకుండా భూముల్లోకి వచ్చి, సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. కోర్టులో తేలేవరకు తమ భూముల వద్దకు రావొద్దని మాజీ సర్పంచ్ బందె రాజశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు కిషన్‌నాయక్, శ్రీకాంత్, రైతులు స్పష్టంచేశారు. ఫార్మాసిటీ కోసం తీసుకున్న అసైన్డ్ భూముల్లోనే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించాలని, పచ్చని పంట పొలాల్లో రోడ్డు వేయడమేంటని ఆర్డీవో అనంతరెడ్డిని రైతులు నిలదీశారు. తమ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో టీఎస్ఐఐసీ పేరు మీద చూపిస్తున్నాయని వాపోయారు. ప్రభుత్వ చర్య వల్ల రైతుబంధు, రైతుబీమా పథకాలకు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మా ఉద్యమంలో రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

గుట్టుచప్పుడు కాకుండా సర్వే?

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేకు సహకరించాలని ఆర్డీవో అనంతరెడ్డి రైతులకు సూచించారు. ఇప్పటికే రూపొందించిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు రూట్ మ్యాప్‌ను మార్చేందుకు వీల్లేలేదని పేర్కొన్నారు. భూసర్వేకు సహకరించాలని కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే మార్కింగ్‌ను అడ్డుకున్న రైతులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో అధికారులు మళ్లీ సర్వేను తిరిగి కొనసాగించినట్టు తెలుస్తున్నది.

నల్లగొండ జిల్లా మర్రిగూడెం మండలంలో నిర్మిస్తున్న శివన్నగూడెం ప్రాజెక్టు పనులను అడ్డుకుంటున్న నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులు

ప్రాజెక్టు పనులను అడ్డుకున్న నిర్వాసితులు

- ఇండ్ల స్థలాలు ఇవ్వాలని నర్సిరెడ్డిగూడెంలో ఆందోళన

మర్రిగూడ, జనవరి 9: నల్లగొండ జిల్లా మర్రిగూడెం మండలంలో నిర్మిస్తున్న శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు బాధితుల ఆందోళనతో నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం గ్రామాల్లో ఉద్రిక్తత నెలకొంది. ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు 257 మందికి బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 154లో డ్రా పద్ధతిలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో స్థలాలను కేటాయించారు. మొత్తం 289 మందికి ఇవ్వాల్సి ఉండగా, 32 మందికి స్థలాలు రాలేదు. ప్లాట్లు రాని బాధితులు అధికారుల తీరుకు నిరసనగా గురువారం ప్రాజెక్టు నిర్మాణ పనులను అడ్డుకొని ఆందోళనకు దిగారు. ఇప్పటికే తాము చాలా నష్టపోయామని గ్రామాన్ని ఖాళీ చేస్తే తమను ఎవరూ పట్టించుకోరని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ చర్లగూడెం ముంపు బాధితులు ఈ నెల 7న ప్రాజెక్టు పనులను అడ్డుకున్న నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం గురువారం చర్లగూడెంలో గ్రామసభ నిర్వహించనున్నామని, చండూరు ఆర్డీవో శ్రీదేవి గ్రామసభకు వస్తారని అధికారులు చెప్పడంతో 200 మంది వరకు గ్రామసభకు చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఎదురుచూసినా ఆర్డీవో రాలేదు. అదే సమయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన, ఎస్టీ హాస్టల్, కేజీబీవీ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించగా ఆర్డీవో వెంటే ఉన్నారు. కలెక్టర్‌ను అడ్డుకుంటామనే ఆర్డీవో తమను గ్రామసభ పేరుతో డైవర్ట్ చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టు పనులను అడ్డుకునేందుకు నిర్వాసితులు ప్రయత్నించగా ఇరిగేషన్ ఈఈ రాములు, డీఈఈ ఖాసీం నచ్చచెప్పారు.

జర్నలిస్టు కేసులో బహిరంగ క్షమాపణ చెప్తా

- అవసరమైతే పరిహారం కూడా చెల్లిస్తా: మోహన్‌బాబు
- మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 9: జర్నలిస్ట్‌పై దాడి కేసులో నటుడు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది. ఆయనపై చర్యలూ తీసుకోరాదని తెలంగాణ పోలీసులను ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు తన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. మోహన్‌బాబు పిటిషన్‌పై పోలీసులు స్పందనను తెలియజేయాలని ఆదేశిస్తూ విచారణను 4 వారాలు వాయిదావేసింది. మోహన్‌బాబు తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. మోహన్‌బాబుతో గొడవపడిన ఆయన కుమారుడు మీడియా సిబ్బందితో తండ్రి ఇంటికి వచ్చాడని తెలిపారు. ఉద్రిక్తతతో ఆవేశానికి గురైన మోహన్‌బాబు జర్నలిస్టుపైకి మైక్ విసిరాడని చెప్పారు. ఆయన తన తప్పును గ్రహించారని, బహిరంగంగా క్షమాపణ చెప్పేందుకు, అవసరమైతే బాధితుడికి పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గాయపడిన జర్నలిస్టును పరామర్శించేందుకు మోహన్‌బాబు దవాఖానకు వెళ్లారని, మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైందని తెలిపారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి.. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి డిమాండ్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 9: రైతాంగ సమస్యల పరిష్కారానికి పాలక ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం(ఏఐపీకేఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ రైతుల పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించాలని, నూతన వ్యవసాయ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో రైతుల రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 16లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా పూర్తిస్థాయిలో అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

వేళాపాలా లేని షో హక్కుల ఉల్లంఘనే

మొదటిపేజీ తరువాయి...

సరికాదని అభిప్రాయపడింది. హీరో రామ్‌చరణ్ నటించిన గేమ్‌చేంజర్ సినిమాను తెల్లవారుజామున 4 గంటల నుంచే ప్రదర్శించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం మెమో జారీ చేయడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన గొర్ర భరత్‌రాజ్, మరొకరు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ప్రముఖ నటుడు నటించిన సినిమా అయితే మరో నెలరోజులైనా జనం చూసేందుకు వస్తారని, ఒకేరోజు అనేక షోలు ఎందుకు ప్రదర్శించాలని ధర్మాసనం ప్రశ్నించింది. అర్ధరాత్రి, అపరాత్రి, తెల్లవారకుండానే సినిమా ప్రదర్శనలు వేయడం సరికాదని పేర్కొంది. రెండు షోల మధ్య 15 నిమిషాల వ్యవధి మాత్రమే ఉంటే ఎలా సరిపోతుందని ప్రశ్నించింది. థియేటర్‌లోని ప్రేక్షకులు బయటకు వెళ్లేందుకు, సినిమా చూడాల్సిన వాళ్లు లోపలికి వచ్చేందుకు పావుగంట సమయం ఎలా సరిపోతుందని సందేహం వ్యక్తం చేసింది. పుష్ప- 2 సినిమా ప్రదర్శనప్పుడు సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిందని, నిన్న తిరుపతిలో కూడా జరిగిందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వమని చెప్పిన తర్వాత గేమ్ చేంజర్ సినిమా ఏమిటని ప్రశ్నించింది.

నిజానికి ఇది ప్రజాహితంతో ముడిపడింది

సినిమా రిలీజ్‌కు ముందు కేసులు వేయడంతో సరిపెట్టొద్దని, ఆ తర్వాత కూడా లాజికల్ ఎండ్ కోసం ఎందుకు ప్రయత్నం చేయడం లేదని హైకోర్టు పిటిషనర్లను ప్రశ్నించింది. వాస్తవానికి ఇది ప్రజాహితంతో ముడిపడిన వ్యవహారం కాబట్టి ప్రజాప్రయోజన వ్యాజ్యం ఎందుకు దాఖలు చేయరని పిటిషనర్లను ప్రశ్నించింది. ఇదే సమయంలో చాలా మంది తెల్లవారుజామునే కాకుండా అర్ధరాత్రి షోలకు కూడా వెళ్లేందుకు సుముఖంగా ఉన్నప్పుడు మీకేమిటి అభ్యంతరం అని కూడా పిటిషనర్లను ప్రశ్నించింది. ఉభయపక్షాల వాదనల అనంతరం.. ఈ వ్యాజ్యాలతోపాటు సంధ్య థియేటర్ ఘటనపై దాఖలైన పిటిషన్‌ను కలిపి శుక్రవారం విచారిస్తామని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ప్రకటించారు.

చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం మెమో

ఈ కేసులో తొలుత పిటిషనర్ల తరపు న్యాయవాదులు మహేశ్ మామ